తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) ఉగాది మినీకథల పోటీలో రు. 150 గెలుపొందిన రచన

# బందోబి

అది ఓ మారుమూల గిరిజన ప్రాంతం! ఆ ప్రాంతాల్లోనికి సైతం కొద్దిగానో.. గొప్పగానో వైద్య సౌకర్యాలు విస్తరించాయని చెప్పవచ్చు కృష్ణలాంటి వారిని చూసి.

కృష్ణ తను చేసే ఉద్యోగంలో సిన్సియారిటీ, సేవా దృక్పథాలున్న వ్యక్తి..! ఆ మన్యంలోని ఇరవయిరెండు గ్రామాలకు అతనే "డాక్టరు బాబు." వాళ్ళ కష్టసుఖాలు తెలుసుకునే 'బల్లో సంగాతు' (మంచి స్నేహితుడు)..!


కృష్ణ ఉద్యోగరీత్యా ఆ ప్రాంతాల్లోనికి వచ్చిన కొద్ది కాలంలోనే అక్కడి గిరిజనుల పరిస్థితుల్నీ.. జీవన సరళినీ ఆకళింపు చేసుకున్నాడు. వాళ్ళ నిత్యజీవితాల్లో పెనవేసుకుపోయి వున్న మూఢ విశ్వాసాలన్నింటినీ ఒక్కసారిగా తొలగించడం కష్టసాధ్యమని తెలిసినప్పటికీ తన వంతు ప్రయత్నం తను చేయసాగాడు..

కృష్ణ మలేరియా హెల్తు వర్కరు. అక్కడి గిరిజనుల రక్తాన్ని స్మియర్ తీయడం, లాబరేటరీ పరీక్షకు పంపడం, పాజిటివ్ కేసులు వచ్చిన వారికి ట్రీట్‌మెంటివ్వడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్య సూత్రాలు బోధించడం అతని విధులు! ఈ విధులన్నిటినీ నెలలో పదహేరు రోజుల్లోనే చేసేసి మిగిలిన రోజులు తమలా కింద బస్తీలకు వెళ్ళి గడిపెయ్యడమంటే ఇష్టపడని కృష్ణని చూసి "ఒరేయ్! నువ్వీ శతాబ్దానికి తగిన మనిషివి కాదురోయ్-" అనేసి తమ దారిని తాము పోయే వారు కొలీగ్స్!

నాగరాజు కృష్ణ స్నేహితుడు, క్లాస్ మేట్ కూడా!

అతనికి సిటీలో మంచి ఆదాయం తెచ్చిపెట్టే ఉద్యోగం వుంది. సిరిని వెంట పెట్టుకు వచ్చిన భార్య వుంది. భార్యలో అందమూ వుంది..! ఆమె మాత్రం ప్రస్తుతం పుట్టింట్లో వుంది. పుట్టింట్లో

వారణాసి ప్రసాదరావు



పురుడు కోసం ఎదురు చూస్తోంది.

నాగరాజుకు ఈ మధ్య చాలా రోజుల్నించి ఏదోలా వుంటోంది! అదెందుకో గమనించిన ఫ్రెండొకడు కదిపాడు నాగరాజుని-

"ఒరేయ్ మన జిడ్డు మొహంగాడు కొండల్లో పనిచేస్తున్నాడు.. తెలుసునా"..

"ఎవడూ.. ఆ..ఆ..కృష్ణగాడేనా.."

"ఆ.."

"అయితే-"

"అయితే ఏంటి గురూ.. కొండల్లో ఏం దొరుకుతాయో తెలీదూ..?" సగం తెల్సీ సగం తెలియనట్టుగా చూసేడు నాగరాజు.

"అలా జిడ్డు మొహం పెడతావేంటి గురూ.. 'మక్క'.. ఏజన్సీ సరుకు.. నందుకు కముజు పిట్టా.. మరి తర్వాతది ఇదీ" అని.. ఆ 'ఇది'ని సైగచేసి చూపించాడు ఫ్రెండు! నాగరాజు మొహం వెలిగిపోయింది.

"తప్పదియ్యా.. ఇంత ఎక్స్‌పీరియన్సుండీ ఆ మాత్రం వెంటనే తట్ట లేదంటే నిజంగా నాది

మట్టి బుర్రే గురూ..'' ఒప్పుకుని ఫ్రెండుని కుదిపేసాడు.

*　　*　　*

చిన్న ట్రావెల్ బేగ్, భుజాన కెమెరాతో బస్సుదిగాడు నాగరాజు. వెనుకనే ఫ్రెండు! సమ్మర్ కాంపుకు వస్తున్నాం అని చెప్పి దిగిన మిత్రులిద్దర్నీ సాదరంగా ఆహ్వానించాడు కృష్ణ.


తన బసకు తీసుకుపోయి భోజన సత్కారాలన్నీ చేసాడు. అంతా గమనిస్తోన్న నాగరాజు ఉండబట్టలేక అనేసాడు.

''రేయ్ కృష్ణా.. చాలా లక్కీరా నువ్వు! ఈ కొండో ళ్ళకేం మందేశావో గానీ కుక్కల్లాగ-నువ్వు ఏదయినా అడగడమే ఆలస్యం..అరక్షణంలో అమర్చి పెడు తున్నారు'' అని భళ్ళున నవ్వాడు నాగరాజు. ఫ్రెండు డిటో!

ఆ ధోరణికి కాస్త బాధనిపించినా చిన్నగా నవ్వాడు కృష్ణ. ''మందుకాదు, వాళ్ళను మంచి చేసుకుంటే ఎవరికయినా ప్రాణం పెడతారు..'' అన్నాడు. అంతలో-

''డాక్టు బావూ..డాక్టు బావూ..'' పరుగున లోనికి రాబోయిన బందేబి లోపలున్న కొత్త ముఖా లను చూసి తటాలున ఆగిపోయింది.

''ఫర్వాలేదు..రా బందేబీ..రా.'' పిలిచాడు కృష్ణ.




ఆ పిల్ల బితుకుమంటూ లోనికొచ్చి నిలబడింది.

''వీళ్ళిద్దరూ నా స్నేహితులు... బస్తీ నుంచి వచ్చారు..'' చెప్పాడు కృష్ణ.

ఆ పిల్ల అప్రయత్నంగా చేతులు జోడించింది.. ఇద్దరికీ''నామస్తే..నామస్తే..'' అంది.

''ఇదిగో ఈ స్వీట్సు తీసుకు వెళ్ళి నువ్వూ, తమ్ముడు తినండి''-నాగరాజుతీసుకువచ్చిన స్వీట్స్ ఓ ప్లేట్లో పెట్టి అందించాడు కృష్ణ.

ఆమె సంశయిస్తూనే తీసుకుని తుర్రుమంది. ఆమె వెళ్ళిన దెసకే చూస్తూ రెండు నిముషాలకు తేరు కున్న నాగరాజు అడిగాడు..

''ఎవ్రరోయ్ ఈ హిల్ బ్యూటీ?!''

''ఈ గూడెం బడ నాయుక కూతురు''

''బలేగుంది గురూ కొండ సరుకు!'' నాగరాజు చెవిలో గుసగుసలాడాడు ఫ్రెండు.

''ఆ పేరేంటి గురూ..''

''వనదేవి! ఇక్కడి వీళ్ళ దేవత పేరు! కానీ వీరి భాషలో అది 'బందేబి' అయిపోయింది!''

''తప్పదియ్యి.. బస్తీలో వుంటే ఈపాటికి సిన్మా ఫీల్డు దున్నేసును గురూ..'' ఫ్రెండు కెవ్ కెవ్వ నవ్వాడు.

''వీళ్ళ నిలాగే ఉండనీరా అవతారం! ఈ ప్రకృతిలో పుట్టిన వాళ్ళు... ఈ ప్రకృతిలోనే పెరిగిన వాళ్ళు... వాళ్ళకి మన తెగుళ్ళెందుకూ అంటిం చడం!'' మెత్తగా అంటించాడు కృష్ణ.

మిత్రులిద్దరికీ ఆ రోజంతా చూడాల్సినవన్నీ చూపించాడు కృష్ణ. అక్కడి వివరాలను చెప్పాడు. జాలీగా గడిచిపోతోంది మిత్రత్రయానికి. నాగరాజు అక్కడి అందమైన ప్రకృతి దృశ్యాలన్నిటినీ ఫోటోలు తీసాడు. అందులో బందేబి కూడా వుంది! ఆ సంగతి కృష్ణకు తెలియదు..

ఆ రాత్రి గూడేనికి కాస్త దిగువన ఓ గిరిజన స్త్రీకి కాన్పు కష్టంగా వుందని [illegible]


నేడు మీరు వాడే సౌందర్య సాధనం
రేపటి మీ అందానికి ఆధారం

చర్మ సంరక్షణ ఉత్పాదనలు:

- అల్మండ్ లనోలిన్ (అండర్ ఐ క్రీమ్) • హైడర్ అండ్ హీలర్
- డీప్ అక్షన్ సింపుల్ ట్రీట్‌మెంట్ క్రీమ్ • టచ్ అండ్ గ్లో (ఫేస్ మాస్క్)
- టెండర్ ఫీల్ (వానిషింగ్ క్రీమ్) • లెమన్ అలో (క్లెన్సింగ్ క్రీమ్)
- పెటల్ సాఫ్ట్ (రోస్ స్కిన్ టానిక్) • స్కిన్ ఫుడ్ (నైట్ క్రీమ్)

కేశ సంరక్షణ ఉత్పాదనలు:

- ఆమ్లా మాసాజ్ హేర్ ఆయిల్ • శీకకాయ షాంపూ
- నేచర్స్ మ్యాజిక్ హెర్బల్ హేర్ డై

Banjara's HERBAL

మెసర్స్. బంజారాస్ హెర్బల్ ప్రాడక్ట్స్ ప్రై. లి.
బంటియా ఎస్టేట్, 207, సిఖ్ రోడ్,
సికందరాబాద్-500 003. (ఆంధ్ర ప్రదేశ్)

DISTRIBUTOR
M/s. పద్మజా ఫార్మా &
కాస్మో (ప్రై) (లి.)
29-7-46/2, కాలేశ్వర్‌రావు రోడ్.
సూర్యారావ్‌పేట విజయవాడ-520 002.



అక్కడికి రెండు మైళ్ళ దూరంలో వున్న సబ్ సెంటరు ఏ ఎన్నెమ్‌ను తీసుకువచ్చేందుకు బయలు దేరాడు కృష్ణ,తోడుగా ఓ గిరిజనుడిని వెంట పెట్టుకుని.

"రాజా.. పొద్దునే వచ్చేస్తాను.. భోజనాల ఏర్పాట్లు అవీ చేసే వుంచాను.. రేపు మరో సైటుకు వెళదాం.." చెప్పి నిష్క్రమించాడు కృష్ణ. కృష్ణ బస ఆ గూడేనికి కొద్ది దూరంలోనే వుంది. అంతా కలిపి మూట ఏభయ్ పాకలు.. గూడేనికి కరెంటు లేదు.. ఓ పాఠశాల వుంది.. అంతే..

కృష్ణ వెళ్ళాక ఓ గిరిజనుడికి పచ్చ నోటిచ్చి ఏజన్సీ బ్రాండుగా పేరుపడ్డ "జీలుగకల్లు" తెప్పించాడు నాగరాజు.. ఇద్దరూ ఆ పనిలో పడ్డారు..

ఆ పని పూర్తి కావస్తుండగా బందేబి వచ్చింది. ఆమె చేతిలో కారియర్.. మరో చేతిలో ఆకుదొన్నె..!

"ఇదేంటే.." ఆకుదొన్నెను చూపిస్తూ అడిగేడు నాగరాజు.

"మచ్చ్వి.." చెప్పిందామె.

"చేపల క్రీ లాగుంది గురో-" వాసన చూపి చప్పరించాడు ఫ్రెండు.

తలాడించింది బందేబి!

"అవన్నీ అక్కడెట్టు.." ఓ మూల చూపించాడు నాగరాజు. చెప్పినట్టు చేసింది బందేబి.

"ఇదిగో.. ఇలారా.. చూడూ ఈ వేళ మా వాడు లేడు. మరి మాకు మజా చేశావనుకో- నీకు స్వీట్స్.. జాకెట్స్.. ఇంకా.." నాగరాజుకు తమకం తన్ను కొస్తోంది.

"ఇలాంటి నోట్లూ.." ఓ పచ్చ కాయితాన్ని చూపించి పూర్తి చేసాడు ఫ్రెండు.

"మరి..ఓ.కే. అమా..!" నాగరాజు కళ్ళలో ఎరుపు జీర కమ్ముకుంది.

ఆమె కేమిటే అర్థమయింది కాదు! ముఖం చిట్లిస్తూ అంది "ఏమిటే.."

"ఏమిటా..ఇదీ-" లేచి ఆమె బుగ్గను కిస్ చేశాడు ఫ్రెండు. భుజం మీది చీరముడి తొలగించాడు రాజు! అప్పటికే వాళ్ళకు కావాల్సినంత వేడి ఇందాక పుచ్చుకున్న సరుకుతో వచ్చేసింది..! ఎదుటనున్న బిగి సడలని వన్నె తరగని కన్నె పరువాన్ని చూసాక ఆ వేడి ఒళ్ళు సలసలా కాగేదాకా వచ్చేసింది! తామేం చేస్తున్నదీ మృగాల్లా మరిచిపోయేరిద్దరూ.

ఆమె అరుస్తూ గింజుకోసాగింది.

అది వారికి మరింత ప్రేరేపణ!

అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కాడు ఫ్రెండు! ఆక్రమించుకోడానికి బలం పుంజుకున్నాడు రాజు!

ఘర్షణ..పెనుగులాట..!

రామ చిలకకీ రాబందులకీ-

లేడి పిల్లకీ వేట కుక్కలకీ-

మధ్యలా మొదలయిన ఆ ఘర్షణ.. పెనుగులాటల్లో-

రామచిలుకే జయించింది.. లేడిపిల్లే గెలిచింది!

బందేబి చేతి కడియాలకు రక్తం అంటింది.. అది వారిద్దరి నెత్తి మీద నుండి చిమ్మింది..!

* * *

కొండల మీదకు సూరీడు వస్తోంటే కృష్ణ వచ్చేడు. వస్తూనే కొయ్యబారి పోయాడా దృశ్యాన్ని చూసి.

స్నేహితులిద్దరూ టేకు చెట్లకి విరిచి కట్టబడి వున్నారు.

"ఏం జరిగింది.." తెప్పరిల్లి అడగబోతున్న కృష్ణని వారించాడు దొడ్డ నాయక.

"సూడు బిడ్డ.. మీ బస్తి సంగాతలేం జేసినరొ.. నా కూన మీదునా అగాత్తెం జేస్తరు.. ఇగొ రఃల్లు.. పెద్దిమంటి (సూర్యుడులాంటి) నీకు సంగాతలయినరు.. అయి బత్కినారు..గాక నా శ్యత.. మరొగాళ్ళు అయ్యినారు.. ఇద్గొ మా తల్లి బందేబికియాటలు గారు..శ్యత్.. మీ బుద్లు మంచి దొక్క- పులిలా గాండ్రించి ఉమ్మేశాడు నాయక. ఉరుములా సాగిన నాయక మాటల్ని విన్న కృష్ణకు గుండాగినంత పనయింది. వారికి ఏమేమి తప్పులో.. అందుకు శిక్ష లేమిటో తనకు తెల్సు! కర్తవ్యం వెంటనే గుర్తుకొచ్చి ముందుకు కదిలాడు.. నాయక చేతులు పట్టుకున్నాడు క్షమించమని. నాయక కృష్ణని అదోలా చూసేడు. ఆ చూపులో.. 'నన్నిప్పుడు మొగమాట పెట్టకు బిడ్డా'అన్న భావం వుంది.. 'నావల్ల నీకు బాధ కలిగితే క్షమించు బిడ్డా-'అన్న అభ్యర్థన వుంది..! గ్రహించాడు కృష్ణ.

నాయక గొంతు మళ్ళీ ఉరిమింది-

"రఃల్లు సేసింది తప్పు. తప్పుకు దండించాల- అది మా కులకట్టు-" చెప్పి కూతుర్ను పిలిచాడు.

" సూడు తల్లి- రఃల్లు నీ యిదం సెడపాలని సూసినోళ్ళు.. అందుగ్గాన రఃళ్ళకి నీవే సిచ్చ జెప్పాల - ఆన ఇస్తన్న.. సెప్పు- " అన్నాడు.

బందేబి కళ్ళలో నిప్పులు కురిపిస్తూ చూసింది ఇద్దర్నీ. ఏమేం చెప్తుందో అన్న ఉత్కంఠతో అందరి గుండెలు కొట్టుకోవడం మానేసినయ్.. గాలి కద లిక లేక ఆగింది..! బందేబి ఒకొక్క అక్షరమే పొడబలుకుతూ శిక్ష చెప్పింది..!

గుండెలు కదిలీ.. గాలీ మెదిలిన మరో పావు గంటకు ఆ ఇద్దరి నాగరికుల నొసట- వారి కులదేవత చిహ్నమయిన త్రిశూలమూ..వక్షం పైన ఆదేవి పేరూ పచ్చబొట్లుగా రూపు దిద్దుకున్నయ్..!!



## నా గురించిన విశేషాలు

తొలి ఊపిరి పీల్చిందీ, గున్నమామిడి ఊగిందీ ఉత్తరాంధ్రలోని 'సోంపేట'లో (శ్రీకాకుళం జిల్లా). తొలి సారిగా ఎదలో కదిలిన భావాలకు అక్షర రూపమిచ్చిందీ అక్కడనే. అలా ఇరవయ్ వసంతాలు.

ఉద్యోగం, కుటుంబం, ఉరుకూ పరుగుల రన్నింగ్ రేస్ గత పద్నాలుగేళ్ళుగా విజయనగరంలో. ఇప్పటిదాకా ఓ రెండు పదుల కథలు, వగైరా వివిధ పత్రికలలో "పడి"వున్నయ్! "నేటి సాహిత్యానికి కొత్త విలువల వలువ లివ్వకపోయినా ఫర్వాలేదు ఉన్నవి ఊడగొట్టకండి" అని చెప్పే మిత్రుడు, మహా మేధావి శ్రీ కళ్ళేపల్లి భాస్కరరావుకి ఏకలవ్యుణ్ణే నేను.

—వారణాసి ప్రసాదరావు,
విజయనగరం

## విశాలాంధ్ర బుక్ రీడర్సు క్లబ్ ప్రారంభం

పుస్తకాల ద్వారా శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తరింప చేయడం, ప్రపంచ శాంతి, స్నేహం, అభ్యుదయ భావాలను వ్యాప్తి చేయడం, పిల్లలలోను పెద్దలలోను ఉత్తమ సాహిత్య పఠనాసక్తిని పెంచడం, పాఠకుల్లో ఉత్తమ సాహిత్య పఠనాశక్తిని పెంచేందుకు పుస్తక ప్రదర్శనలు, సెమినార్లు, ప్రసంగాలు, సాహిత్య సభలు, సాహిత్య చర్చలు నిర్వహించాలనే ఆశయాలతో విశాలాంధ్ర ప్రచురణాలయం, హైదరాబాదులో 'విశాలాంధ్ర బుక్ రీడర్స్ క్లబ్'ను ప్రారంభించింది.

ఈ క్లబ్బులో పై ఆశయాల సాధనకు సహాయపడే 5 సంవత్సరములు, ఆ పైన వయస్సు కలవారందరు మెంబర్లుగా చేరవచ్చును. క్లబ్‌లో మెంబరుగా చేరగోరువారు సభ్యత్వ రుసుము సంవత్సరానికి పది రూపాయిలు, 3 సంవత్సరములకు రూ. 20లు చెల్లించవలసి వుంటుంది. క్లబ్బులో మెంబరుగా చేరిన వారికి విశాలాంధ్ర మరియు సోవియెట్ పుస్తకాల కొనుగోళ్ళపై రాష్ట్రంలోని విశాలాంధ్ర బుక్ హౌస్‌లలోనూ, వారు నిర్వహించే పుస్తక ప్రదర్శనలలోను, సంచార పుస్తకాలయాల్లోను 20 శాతం ప్రత్యేక తగ్గింపు యివ్వబడును. ఈ క్లబ్బులో మెంబరుగా చేరడానికి విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలలోను దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయి.

సాహిత్య ప్రియులందరూ పై ఆశయాల వ్యాప్తికై ఈ క్లబ్బులో మెంబరుగా చేరి తోడ్పడవలసినదిగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజరు శ్రీ పి.రాజేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.